**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 21.06.2026** **సమయం:18.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ వ్యాప్తంగా యోగా వేడుకలను ఘనంగా నిర్వహించారు.
2. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు.
3. రాష్ట్రవ్యాప్తంగా 208 కేంద్రాలలో ఈ రోజు నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశాతంగా ముగిసింది.
4. రాష్ట్రంలో రేపటి నుంచి మూడు రోజుల పాటు అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

..................................................................

**యోగా....**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ వ్యాప్తంగా యోగా వేడుకలు ఘనంగా జరిగాయి. అన్ని జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో నిర్వహించిన యోగా వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, వివిధ రంగాల ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకొని, ఒత్తిడిని జయించేందుకు యోగా ఒక అద్భుతమైన దివ్య ఔషదమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. ప్రజలంగా యోగాను జీవితంలో తప్పనిసరిగా భాగం చేసుకోవాలని, ఆరోగ్య తెలంగాణ, ఆరోగ్య భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మంత్రులు దామోదర

రాజనరసింహ, పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. అన్ని జిల్లాల్లో యోగాను అధికారికంగా నిర్వహించారు.

......ఆల్ పిటీసీస్

**బండి సంజయ్...**

కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం కాంగ్రెస్ , బీఆర్ఎస్ నేతలకు ఫ్యాషన్ అయిపోయిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని తెలిపారు. అయితే, గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసమే కేంద్రంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. హైదరాబాద్ హైటెక్ సిటీకి ఐటీ కంపెనీలన్నింటినీ తామే తీసుకువచ్చామని బీఆర్ ఎస్ చేసుకుంటున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. విదేశీ కంపెనీలు ఎప్పుడైనా కేంద్రంలో ఉన్న బలమైన ప్రభుత్వాన్ని, దేశ నాయకత్వాన్ని చూసి పెట్టుబడులు పెట్టడానికి వస్తాయని అన్నారు..

......... పిటీసీ కరీంనగర్

**నీట్ పరీక్ష....**

నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్ తెలంగాణలో ప్రశాంతంగా ముగిసింది. పరీక్షను మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5గంటల 15 నిమిషాల వరకు నిర్వహించారు. వికలాంగులైన విద్యార్థులు సాయంత్రం 6 గంటల 20 నిమిషాల వరకు పరీక్ష రాసే అవకాశం కల్పించారు. అక్కడక్కడ ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అధికారులు పరీక్షకు అనుమతించలేదు. తెలంగాణలో సుమారు 72 వేల 956 మంది విద్యార్థులు నీట్-యూజీ పరీక్షకు హాజరుకావాలని నమోదు చేసుకున్నారు. వీరందరి కోసం రాష్ట్రవ్యాప్తంగా 24 నగరాల్లో 208 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫిజిక్స్ క్వశ్చన్లు లెంగ్తీగా ఉన్నాయని, బయోలజీ పేపర్ బాగుందని, కెమిస్ట్రీ కొంత హార్డుగా ఉందని అభ్యర్థులు తెలిపారు.

.....డెస్క్

**కొండా విశ్వేశ్వర్ రెడ్డి...**

ప్రతి మనిషి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలంటే యోగ సాధన తప్పనిసరని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. “ప్రాచీన భారతీయ యోగ విధానాన్ని” ప్రపంచ దేశాలకు పరిచయం చేసి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ఘనత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకే దక్కుతుందని ఆయన కొనియాడారు. తాండూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ....

<u>**బైట్... కొండా విశ్వేశ్వర్ రెడ్డి**</u>

.........పిటీసీ వికారాబాద్

**మహబూబాబాద్ - కోదండరాం**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో కేసులు లేని ఉద్యమకారులు, కళాకారులు, రచయితలను గుర్తించడంలో కొన్ని సమస్యలు ఉన్నాయని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు ఎం. కోదండరాం తెలిపారు. మహబూబాబాద్‌లో జరిగిన జిల్లా స్థాయి ఉద్యమకారుల సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఉద్యమకారుల నుంచి వచ్చిన వినతులను కమిటీ దృష్టికి తీసుకెళ్లి తగిన నిర్ణయాలు తీసుకునేలా కృషి చేస్తానన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన వారికి తగిన గుర్తింపు, గౌరవం దక్కాలన్నారు. ఉద్యమకారులపై నమోదైన కేసులు, జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించే అంశాలపై కూడా కమిటీ పరిశీలన కొనసాగుతోందని చెప్పారు

......పిటీసీ - మహబూబాబాద్

**బీజేపీ రామచందర్ రావు...**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీల అమలులో విఫలమైందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఆరోపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చని హామీలపై

తెలంగాణ ప్రజల గోడును వినిపించేందుకు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో అత్యవసరంగా భేటీ ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, అమలుకాని హామీల అంశాన్ని నేరుగా రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఈ విషయంలో ముఖ్యమంత్రి వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

......... డెస్క్

**మీనాక్షి నటరాజన్ ...**

తన రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. తన కోసం మరికొరితో రాజీనామా చేయించి తెలంగాణలో రాజ్యసభ సీటు తీసుకోలేదన్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తిని కాబట్టే అక్కడి నుంచే సీటు కోరుకుంటానన్నారు. తనపై లీగల్ కేసులేమీ లేవని చెప్పారు. ఓ కేసు అంశాన్ని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొనలేదనే కారణంతో ఈసీ తన నామినేషన్ ను తిరస్కరించిందన్నారు. తన సీటు చోరీ జరిగిందన్నారు.

....... డెస్క్

**ఎస్ ఐ ఐ ఎం హెచ్ - యోగా....**

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, వైద్యులు, పరిశోధకులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌చార్జి డాక్టర్ జి.పీ. ప్రసాద్ మాట్లాడుతూ, శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతకు యోగా ఉత్తమ సాధనమని పేర్కొన్నారు.

.......... ఎం ఎస్

**మంచిర్యాల – సింగరేణి**

మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో బొగ్గు ఉత్పత్తి, రవాణా పూర్తిగా పారదర్శకంగా జరుగుతోందని ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ తెలిపారు...ఆయన ఈ రోజు

ఆకాశవాణి ప్రతినిధితో మాట్లాడుతూ... సంస్థలో ఒక్క కిలో బొగ్గు కూడా దొంగతనానికి గురయ్యే అవకాశం లేదన్నారు. GPS, RFID ట్యాగ్‌లు, జియో ఫెన్సింగ్, సీసీ కెమెరాలు, వే బ్రిడ్జిల ద్వారా ప్రతి లారీని పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఆధునిక సాంకేతికతతో బొగ్గు రవాణాపై నిరంతర నిఘా కొనసాగుతోందని తెలిపారు...

....పిటీసీ- మంచిర్యాల

**ఖమ్మం - యోగా**

ఖమ్మం లోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆయుష్ వైద్య విభాగం, జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో యోగా సాధకులు, విద్యార్థిని విద్యార్థులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ దివాకర టి ఎస్ మాట్లాడుతూ...యోగా అనేది చాలా సులభమైన ప్రక్రియని, దీనిని ప్రతి ఒక్కరూ సులభంగా నేర్చుకోవచ్చని తద్వారా చదువుపై, చేసే పనిపై ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు.

**బైట్..కలెక్టర్ దివాకర టి ఎస్**

.........పిటిసీ- ఖమ్మం

**వాతావరణం...**

రాష్ట్రంలో రేపటి నుంచి మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయంటూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కాగా కొన్ని జిల్లాల్లో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురుసాయని పేర్కొంది. మరోవైపు అత్యధిక జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 నుండి 43 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయని తెలిపింది.

........ డెస్క్